క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెం వీరనరసింహులు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకరణాల పంపిణీ

కదిరి అర్బన్: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం ఎంఈఓ చెన్నకృష్ణ ఉపకరణాలను పంపిణీ చేశారు. సీపీ చైర్, వీల్ చైర్, ట్రై సైకిల్, హియరింగ్ ఉపకరణాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ మల్లికార్జున పాల్గొన్నారు.

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో మార్చి 3, 4వ తేదీల్లో జరగనున్న ఇస్తెమా ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇస్తెమా ఏర్పాట్లకు తన వంతు సాయం చేస్తానని ముస్లిం సోదరులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్, లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ రాక

పుట్టపర్తి అర్బన్: మూడు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఏ.శంకరనారాయణ శనివారం పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు పుట్టపర్తి చేరుకోనున్న బీసీ కమిషన్ చైర్మన్ రాత్రి ప్రశాంతినిలయంలోని శాంతి భవన్‌లో బస చేస్తారన్నారు. ఆదివారం ఉదయం సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పేర్కొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



నల్లమాడలోని ఓ పెట్రోల్ బంక్‌లో స్టాకు నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

నల్లమాడ: నల్లమాడ, కొత్తపల్లి తండా సమీపంలోని మూడు పెట్రోల్ బంక్‌లను శుక్రవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ షబ్నమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ స్టాకు నిల్వ, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. పెట్రోల్ కల్తీ పరీక్షలు నిర్వహించి కల్తీ కాలేదని నిర్ధారించారు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెట్రోల్ బంకుల నిర్వాహకులు, సిబ్బందికి సలహాలిచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

తలుపుల: తలుపుల మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 2022–23 సంవత్సరం, గత సంవత్సరాలకు సంబంధించి ఇంటి, నీటి పన్ను బకాలయిలను మార్చి 10లోపు చెల్లించాలని ఈఓ మాధవరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు, కొళాయిలు, లే అవుట్లు వేయకూడదన్నారు. కుళాయి కనెక్షన్ కావాలనుకునే వారు రూ.2,600 డిపాజిట్ చెల్లించి కనెక్షన్ తీసుకోవచ్చన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టే వారు స్థల వ్యాల్యుయేషన్‌లో 14 శాతం చెల్లించి అనుమతి తీసుకుని నిర్మించుకోవాలని తెలిపారు. నీటి పన్ను ఏడాదికి రూ.350 చెల్లించాలన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సచివాలయం తనిఖీ

తనకల్లు: మండల పరిధిలోని తవళం సచివాలయాన్ని ఎంపీడీఓ పూల నరసింహులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు యూనిఫాం ధరించి విధులకు హాజరుకావాలన్నారు. లేకుంటే జీతాన్ని నిలిపివేస్తామని హెచ్చరించారు.

రామగిరి: మండలంలోని నసనకోట, మాదాపురం సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ ఆజాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఆయన రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.


పరీక్ష సామగ్రి పంపిణీ

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిలకలగడ్డపల్లికి చెందిన పూర్వ విద్యార్థి హరీష్ శుక్రవారం సుమారు 88 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, పాల్గొన్నారు.

చూసొద్దామా.. కాటికోటేశ్వర క్షేత్రం

- మార్చి 6 నుంచి బ్రహ్మోత్సవాలు
- నాలుగు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలో వెలసిన కాటికోటేశ్వర క్షేత్రం ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ప్రకృతి ఒడిలో ప్రశాంత వాతావరణంలో పచ్చని పంటపొలాల మధ్య వెలసిన కాటమయ్య దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా అభివర్ణించవచ్చు. ఈ క్షేత్రంలో వెలసిన కాటికోటేశ్వరుడు సాక్షాత్తు మహాశివుడి స్వరూపమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ దేవాలయాన్ని సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. అయితే ప్రస్తుత ఆలయ ధర్మకర్తలు ఈ ఆలయాన్ని తిరిగి పునః నిర్మించారు.



కాటి కోటేశ్వరక్షేత్రంలోని దేవాలయం

ఏటా బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా మార్చి 6వ తేదీన రెడ్డివారి బోనాలు నిర్వహిస్తారు. గ్రామంలోని రెడ్లు అందరూ సమావేశమై క్షేత్రానికి చేరుకుని స్వామికి తొలిపూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం వేద పండితులు తొలిపూజలు చేస్తే.. మిగిలిన రోజుల్లో తలార్లు (బోయ) పూజలు చేస్తారు. 7వ తేదీ స్వామివారి మూలస్థానమైన ఈదులముస్తూరు నుంచి పల్లకీలో స్వామి మూలవిరాట్‌ను కాటికోటేశ్వర క్షేత్రంలోకి తీసుకొస్తారు. అక్కడ ఆలయ ధర్మకర్తలు తొలిపూజలు చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ రోజు పరిసర గ్రామాల వారు పానకం బండ్లతో కాటమయ్య కొండ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. రాత్రికి పూజలు, భజనలు విశేషంగా జరుగుతాయి. 8వ తేది రాత్రి వేలసంఖ్యల్లో భక్తులు పాల్గొని బాణాసంచా కాలుస్తారు. దీనిని లంకాదహనంగా అభివర్ణిస్తుంటారు. ఇదే రోజు ఆంజనేయ స్వామి అలనాటి కాలంలో లంకను దహించినట్లుగా భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవం స్థానికులను ఆకట్టుకుంటుంది. 9వ తేది జాతర జరుగుతుంది. అనంతరం ముస్తూరు గ్రామంలో 10వ తేది రథోత్సవం నిర్వహిస్తారు. ఈ జాతరలో భక్తులు వివిధ వేషధారణలతో కనిపిస్తుంటారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నలుమూలల నుంచి భక్తులు విశేషంగా ఈ క్షేత్రాన్ని దర్శిస్తారు. క్షేత్రంలో గంగుమాలమ్మ (గంగమ్మ) గుడి, పోతులయ్య గుడి, అక్కమ్మ దేవతలు, నాగలకట్ట తదితర దేవాలయాలున్నాయి. కొండశిఖరంలో స్వామి వారి గరుడ స్తంభం మీద వెలిగించే జ్యోతిని చూడడానికి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.



కాటి కోటేశ్వరుడి మూలవిరాట్

పెళ్లిలకు వేదిక..

ఈ క్షేత్రంలో అన్ని సౌకర్యాలు ఉండటంతో ఇక్కడ పెళ్లిళ్లు అధికంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన తిరుమల తిరుపతి దేవస్థానం వారు కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ మండపం అందరికీ అందుబాటులో ఉంది. ఈ క్షేత్రంలో ఒకేరోజు 10 నుంచి 20 దాకా పెళ్లిళ్లు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

ఇవీ క్షేత్రం ప్రత్యేకతలు..

కొండకు పడమటి దిశన హనుమంతుడి పాదం అని చెప్పబడే హనుమప్పదొన ఉంది. బండ మీద ఉన్న ఈ దొనలో ఎల్లప్పుడు నీరు పొంగుతుండటం విశేషం. అంతేకాక ఆ నాటి లోతు ఇంత వరకూ ఎవ్వరికీ అంతు తెలియడం లేదు. ఈ దొనలోని నీరు అతి చల్లగా, తీయగా ఉంటాయి. ఈ దొనలోని నీటిని తెగుళ్ల సోకిన పంట పొలాలపై, అనారోగ్యానికి గురైన పశువులు, రోగులపై చల్లితే వ్యాధులు నయమవుతాయని నమ్మకం. ఈ కొండలో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ క్షేత్రంలో నిద్రచేస్తే బాధలు తొలగిపోతాయని, కాటమయ్య కుక్కలాగ కలలో కనిపించి వారికి పరిష్కార మార్గం చెబుతారని ప్రతీతి. కోర్కెలు తీరిన భక్తులు స్వామికి కానుకలు సమర్పించుకుంటారు. మరి కొందరు తమ తలనీలాలు సమర్పించుకుంటారు.

ఉపాధి పనుల పరిశీలన

ఎన్పీకుంట: మండలంలోని మేకలచెరువు పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ ఆదినారాయణ పరిశీలించారు. తిమ్మరాజుకుంట, పెద్దచెరువులో జరుగుతున్న పూడికతీత పనులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. నిర్దేశించిన విధంగా నీరు నిల్వ ఉండేలా లోతుగా పూడిక తీయాలన్నారు. అలాగే మస్టర్లను తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ కవివర్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్రిడ్జ్ వితరణ

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చల్లని తాగునీటి కోసం ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి శుక్రవారం తన తండ్రి పాటిల్ కృష్ణమూర్తి వేణుగోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం రూ.12 వేలు విలువ చేసే ఫ్రిడ్జ్ అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ కామాక్షి, ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని గొికవారిపల్లిలో శుక్రవారం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేగవంతంగా నిర్మాణాలను పూర్తి చేసి బిల్లులను పొందాలన్నారు. కేవలం 3 బిల్లుల రూపంలోనే మొత్తం నిధులను ఇవ్వనున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

గాండ్లపెంట: కటారుపల్లి సచివాలయం నలసాని వారిపల్లికి చెందిన వలంటీర్ వినయ్ అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స చేయించుకుని, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి శుక్రవారం రాత్రి వినయ్‌ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని.. ఏ అవసరం వచ్చినా సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతంజగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నాయకులు భరత్‌రెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

తలుపుల: పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దుక్కుతుందని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం, ఓబీఆర్ రోడ్డు, నంగివాడ్లపల్లిలో ఎంపీపీ రఫీనాయక్, సర్పంచ్ టోపీ రమణ, ఉప సర్పంచ్ డిక్ బాబు ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీ పరిధిలోని గ్రాడ్యుయేట్స్ ఓటర్లను గుర్తించాలన్నారు. ఎట్టి పరిస్థితిలో ఒక్క ఓటుకూడా మిస్ కాకుండా చూడాలన్నారు. ప్రతి ఓటు పోల్ అయ్యేలా, వేయించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. గృహసారథులకు మార్చి13 తరువాత మెటీరియల్ అందజేస్తామన్నారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి, వారి మొబైల్‌తో మిస్‌డ్ కాల్ ఇచ్చి, వారి ఆమోదంతో జగనన్న స్టిక్కర్ అతికించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఓటర్లకు ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డి సోదరుడు విశ్వనాథరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పురుషోత్తం రెడ్డి, ఫయాజ్ అహమ్మద్, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్ పీర్, రాజగోపాల్‌రెడ్డి, వివేకానందరెడ్డి, ఫణికుమార్ రెడ్డి, సథారెడ్డి, వార్డు మెంబర్లు మౌలా, సుహాస్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 6, 7 ,8 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీస్సులతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఏ విధంగా వేయాలో అవగాహన కల్పించారు.

పేదలందరికీ ఇళ్ల మంజూరు

ఓడీ చెరువు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇనగలూరు, అల్లాపల్లి పంచాయతీల పరిధిలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి జియో ట్యాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఇనగలూరులో నిర్వహించిన సమావేశంలో అధికారులు మాట్లాడారు. ఇనగలూరులో 70, ఇ.గొల్లపల్లిలో 30, గాజుకుంటపల్లిలో 27 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. ఇంకా అర్హత ఉండి రానివారుంటే వారికి కూడా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారుల నిర్మాణాలకు సంబంధించి జియో ట్యాగింగ్ చేశారు. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సూచనలిచ్చారు. జియో ట్యాగింగ్ పూర్తయిన లబ్ధిదారులకు త్వరలో సిమెంట్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బాబాఫకృద్దీన్, వెంకటరమణ, ఈఓఆర్డీ రాజశేఖర్, కార్యదర్శి ప్రకాష్, వీఆర్వో రమణ, విలేజ్ ఇంజినీర్ దిలీప్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ చౌడప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గజ్జెల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఇనగలూరులో జియోట్యాగింగ్ చేస్తున్న దృశ్యం

రికార్డులను పక్కాగా నిర్వహించాలి

పుట్టపర్తి అర్బన్: పోలీస్ స్టేషన్లలో రికార్డులను పక్కాగా నిర్వహించి, భద్రపరచాలని పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. స్పందన అర్జీలను పరిష్కరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఫిర్యాదుల క్లియరెన్స్ ఎలా ఉంది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ప్రాపర్టీ సంరక్షణ, నైట్ డ్యూటీ షెడ్యూల్ తదితర అంశాలను పరిశీలించారు. అక్రమ మద్యం కేసులు, మహిళా పోలీసుల సేవలను ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారని ఆరా తీశారు. ఏడాదికి ఒకసారి ప్రతి అంశాన్నీ పరిశీలించి సూచనలిస్తామన్నారు. అంతకు ముందు స్థానిక రూరల్ స్టేషన్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సీఐ జయానాయక్, ఎస్‌ఐ బాబ్జాన్, పాల్గొన్నారు.



వార్షిక నివేదికను సమీక్షిస్తున్న డీఎస్పీ యశ్వంత్

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి చర్యలు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి పెద్ద తండాలో 2 లక్షల లీటర్ల కెపాసిటీతో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహ్మద్ ఇక్బాల్, ఏఈ సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం తండాలోని పాత ట్యాంకును పరిశీలించారు. నీరు కారుతుండడంతో ఇబ్బందిగా ఉందని తండావాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వేసవిలో నీటి వినియోగం అధికంగా ఉంటుందన్నారు. గ్రామంలో కుటుంబాలు బాగా పెరిగాయని చెప్పారు. వివరాలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ట్యాంకు నిర్మాణానికి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహ్మద్ ఇక్బాల్ తెలిపారు. తండాతో పాటు పెడపల్లి గ్రామంలో 5 వేల ఇళ్లు ఉన్నాయని, నీటి అవసరాలు అధికంగా ఉంటాయని చెప్పారు. తండా పక్కనే రెండు కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని చూపించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌నాయక్, రవి, ఆంజనేయులు నాయక్, బాపూజీ నాయక్,మోహన్‌నాయక్, సచివాలయం ఏఈ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



పాత ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముదిగుబ్బ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ముదిగుబ్బలోని 1వ వార్డులో స్థానిక నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98 శాతం వరకూ నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న మన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రాయుడు, భాస్కర్, శ్రావణ్, కృష్ణారెడ్డి, రామకృష్ణ, కుళ్లాయప్ప పాల్గొన్నారు.



పథకాలపై ఆరా తీస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

పోతలయ్యస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


కనగానపల్లి: మండలంలోని దాదులూరులో జరిగిన పోతలయ్యస్వామి జాతరలో శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలోని పోతులయ్య, చెన్నేకేశవస్వాములను దర్శించుకున్నారు. ఆలయ పూజార్లు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుర్లపల్లి నరసింహారెడ్డి, స్థానిక సర్పంచ్ మురళీ, ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఎరువుల యాజమాన్యం తప్పనిసరి

ఓడీ చెరువు: మొక్కజొన్న పంటలో ఎరువుల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని కదిరి ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వేమన, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ అన్నారు. శుక్రవారం మండలంలోని సున్నంపల్లి, తిప్పేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. సున్నంపల్లి వద్ద రైతులు ఉరవకొండ మాబూసాబ్, హరాస్వేనప్ప సాగు చేసిన మొక్కజొన్న కంకి బలంగా రాకపోవడంతో సీడ్స్ కంపెనీపై అధికారులకు ఫిర్యాదు చేశారు. పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు.. మొక్కజొన్న సాగుకు ముందు దుక్కిలో 150 కిలోల ఎస్ఎస్‌పీ, 50 కిలోల ఎంఓపీ వేసి బాగా కలియదున్నాలన్నారు. విత్తనాలు విత్తేటప్పుడు, తర్వాత 30 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు ఒకసారి ఎకరాకు 35 కిలోల చొప్పున యూరియా వేయాలన్నారు. కత్తెరపురుగు వ్యాధి సోకడంతో పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు ఎమ్మామెక్టిన్ బెంజైట్ 80 గ్రాములు ఎకరాకు వేసుకోవాలన్నారు. లేదా క్లోరీఫైరిఫాస్ 500 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి ఇలియాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.



కత్తెర తెగుళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బాలుర వసతి గృహం సందర్శన

ఎన్పీకుంట: హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత, కంటి, రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన పోతలప్ప స్వామి ఉత్సవాలు



జ్యోతులు తీసుకొస్తున్న గ్రామస్తులు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో పెద్దకమ్మవారిపల్లి గ్రామం చింతతోపు సమీపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కేన్నకేశవ, బంగారు లింగమయ్య, పోతలప్ప స్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులు జరిగిన ఈ ఉత్సవాలకు చివరి రోజు గ్రామస్తులు జ్యోతులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎద్ల బండ్లను దేవాలయం చుట్టూ తిప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పుట్టపర్తి అర్బన్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి గట్టి బందోబస్తు నిర్వహించారు.

దిగువపల్లిలో గ్రామసభ

ఓడీ చెరువు: ప్రజలు సోదరభావంతో కలసిమెలసి జీవించాలని ఎస్‌ఐ గోపి అన్నారు. మండలంలోని దిగువపల్లిలో శుక్రవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు అనవసరంగా గొడవలకు దిగితే చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలకు పాల్పడే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

తాడిమర్రి: మండలంలోని మరవపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనం సిబ్బంది ఎంపీహెచ్ఈఓలు మనోహర్‌బాబు, నారాయణస్వామి తదితర వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

బత్తలపల్లి: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, అందుకు అనుగుణంగా పంటలు, ఎరువులు వేసుకోవాలని ఏఓ ఓబిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని డి.చెర్లోపల్లి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు తమ దిగుబడులను అమ్ముకోవాలన్నారు. ఈ–క్రాప్ చేయించుకోవాలని తెలిపారు.